ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నంద్యాల
జిల్లా వార్తలు 5
ఆదివారం 3 మార్చి 2024




కాలినడకన శ్రీశైలానికి వెళ్తున్న భక్తులు

భృంగి వాహనంపై శ్రీశైలేశుడు





- స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజా క్రతువులు
- ద్వారకా తిరుమల నుంచి పట్టువస్త్రాలు
- శ్రీగిరికి తరలి వస్తున్న భక్తులు
- నిండిపోతున్న వసతి కేంద్రాలు

శ్రీశైలం, మార్చి 2: ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ఒకటైన శ్రీశైలం మహా క్షేత్రంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా రెండో రోజు నుంచి వాహన సేవలు, గ్రామోత్సవాలు మొదలయ్యాయి. అర్ధనారీశ్వర రూపానికి మూలకారకుడైన భృంగి భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామివార్ల సేవలో తరించారు. భృంగి వాహనంపై స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఆశీనులనుజేసి సుగంధ పుష్పాలతో అలంకరించారు. అనంతరం స్వామి అమ్మవార్లను క్షేత్ర పురవీధుల్లో విహరింపజేశారు. అశేష భక్తజనం ఈ అద్భుత ఘట్టాన్ని కనులారా వీక్షించి పరవశించారు. గ్రామోత్సవం ముంగిట కోలాటం, చెక్కభజన, వేషధారణలు, జాంజ్ పథక్, గోరవయ్యలు, బుట్టబొమ్మల నృత్యాలు, బీరప్ప డోలు, బంజార నృత్యం, తప్పెట్లు, శంఖానాదాలు, మంగళవాయిద్యాలతో కొనసాగింది. ఆలయ రాజగోపురం నుంచి గంగాధర మంటపము మీదుగా బయలు వీరభద్రస్వామి ఆలయం వరకు గ్రామోత్సవ క్రతువు జరిగింది.


పట్టు వస్త్రాలను తెస్తున్న ప్రధాన అర్చకులు

రోజువారి క్రతువులు

మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని శ్రీశైలంలోని ఉభయ దేవాలయాలలో స్వామిఅమ్మవార్లకు ఉదయం నుంచి ప్రత్యేక పూజాక్రతువులు నిర్వహించారు. చండీశ్వర పూజ, జాపానుష్టానాలు, స్వామివారికి విశేష అర్చనలు, అమ్మవారికి నవవరణార్చనలు, రుద్ర, చండీ హోమాలను శాస్త్రోక్తంగా జరిపారు. సాయంకాలం అనుష్టానాలు, నిత్యవాహన కార్యక్రమాలను అర్చక, వేదపండితుల సమక్షంలో నిర్వహించారు.

స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాల సమర్పణ

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లకు ద్వారకా తిరుమల వేంకటేశ్వరస్వామి దేవస్థానం తరపున ఆలయ ఉప కార్యనిర్వహణాధికారి బాబురావు, ఉప ప్రధానార్చకులు కొండూరి జనార్దనాచార్యులు పట్టువస్త్రాలను సమర్పించారు. ఆదివారం విజయవాడ ఇంద్రకీలాద్రి దుర్గామల్లేశ్వర స్వామి అమ్మవార్ల దేవస్థానం తరఫున భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్లకు పట్టువస్త్రాలను సమర్పించనున్నారు.

శ్రీగిరికి తరలివస్తున్న భక్తులు

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీగిరికి భక్తులు అధిక సంఖ్యలో తరలి వస్తున్నారు. బ్రహ్మోత్సవాల్లో రెండో రోజైన శనివారం నల్లమల అటవీ మార్గం మీదుగా కాలినడకన వచ్చే భక్తులతోపాటు వివిధ ప్రాంతాల నుంచి శివస్వాములు తరలి రావడంతో శ్రీశైల క్షేత్రంలోని ప్రధాన వీధులన్నీ రద్దీగా దర్శనమిచ్చాయి. అలాగే క్షేత్రంలోని అన్నదాన సత్రాలు, వసతి కేంద్రాలు భక్తులతో కిక్కిరిశాయి. ప్రత్యేకించి స్వామిఅమ్మవార్ల దర్శనార్థం భక్తులు క్యూలైన్లలో బారులుదీరారు. అదేవిధంగా ప్రసాద విక్రయ కేంద్రాల వద్ద భక్తుల రద్దీ కనిపించింది. అలాగే కళ్యాణకట్ట కేంద్రాల్లో భక్తులు అధిక సంఖ్యలో తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

మల్లన్నకు ఇరుముడి సమర్పించిన శివదీక్షాపరులు

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని మండల, అర్ధమండల దీక్షను స్వీకరించిన శివస్వాములు శనివారం శ్రీశైలం మల్లన్నకు భక్తితో ఇరుముడులు సమర్పించారు. ముందుగా దేవస్థానం వారు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన క్యూలైన్ల ద్వారా శివస్వాములు ఇరుముడులతో స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం శివదీక్షా శిబిరాల్లో శాస్త్రోక్తంగా శివదీక్ష విరమించారు.




అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా దేవస్థానం పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసింది. ఈ సాంస్కృతిక కార్యక్రమాలను ఆలయ దక్షిణ మాడ వీధిలోని నిత్యాకళారాధన వేదిక, పుష్కరిణి ప్రాంగణంలోని భ్రామరీ కళావేదిక, శివ దీక్షా శిబిరాల ప్రాంగణంలో నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా శనివారం సాయంత్రం సంప్రదాయ నృత్య ప్రదర్శన, కూచిపూడి నృత్యప్రదర్శన, భరతనాట్యం, రామాంజనేయ యుద్ధం, భూకైలాసం నాటకం కార్యక్రమాలను నిర్వహించారు.

నేడు హంస వాహన సేవ

బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజైన ఆదివారం స్వామి అమ్మవార్లు హంస వాహనంపై సేవలో ఊరేగనున్నారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.


పాతాళగంగలో స్నానాలు చేస్తున్న భక్తులు


నృత్యం చేస్తున్న చిన్నారులు

మిర్చి రైతు కుదేలు



- వర్షాభావంతో అరకొరగా దిగుబడి
- ధర పతనంతో మరింత కుంగుబాటు

నందికొట్కూరు,మార్చి 2:

ఆరుగాలం చెమటోడ్చి పండించిన ఎండు మిరప ధర తగ్గిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. నియోజకవర్గంలో దాదాపు రెండు వేల ఎకరాల వరకు ఎండు మిరప సాగు చేశారు. ఈ ఏడాది మిడ్తూరు, నందికొట్కూరు, జూపాడుబంగ్లా, పగిడ్యాల మండాల పరిధిలోని గ్రామాల్లో విస్తారంగానే మిరప పంట వేశారు. అయితే ఈ ఏడాది తీవ్ర వర్షాభావం కారణంగా తెగుళ్లు, భూగర్భ జలాలు ఇంకిపోయి బోర్లలో నీరు రాకుండా పోయింది. దీంతో మిరప పంటకు నీరందించలేని పరిస్థితి ఏర్పడింది. ఫలితంగా దిగుబడులు సగానికి పైగా పడిపోయాయి. గత ఏడాది దిగుబడి ఆశాజనకంగా ఉండడంతోపాటు, మార్కెట్‌లో మంచి ధర అందడంతో రైతులు ఎక్కువగా ఎండు మిరప సాగు చేశారు.

- గత సంవత్సరం ఎండు మిరప కాయలు క్వింటా రూ.22 వేల వరకు ఉండగా ఈ సారి రూ.14 వేల లోపే ఉంది. ఒక్కసారిగా క్వింటాకు రూ.8 వేల వరకు తగ్గిపోయిందని రైతులు తెలిపారు. పంటను అమ్ముకోవడానికి కనీసం మార్కెట్ వసతి కూడా లేదు. గుంటూరులో మాత్రమే మార్కెట్ ఉంది. సుదూర ప్రాంతాలకు ఎండు మిరపకాయలను తరలించడానికి నానా అవస్థలు పడుతున్నారు.
- పెరిగిన పెట్టుబడులు: గతేడాది ఎకరానికి 20 క్వింటాళ్ల మేర దిగుబడి రాగా ఈ సారి పలు అవాంతరాల నేపథ్యంలో 10 నుంచి 12 క్వింటాళ్లు రావడం గగనంగా మారింది. తెగుళ్ల నివారణకు రూ.60 వేల వరకు నీళ్ల మందు, రసాయన ఎరువులు రూ.40 వేలు సగటున ఎకరానికి రూ.లక్షకు పైగా పెట్టుబడులు పెరిగాయి. ఇక కాయలను కోయడానికి, గ్రేడింగ్ చేయడానికి, అదనంగా రూ.30 వేల వరకు ఖర్చు వస్తుందని రైతులు పేర్కొన్నారు. ఇక సొంత భూములు లేని రైతులు ఎకరానికి రూ.25 నుంచి రూ.30 వేల వరకు ముందుగానే కౌలు చెల్లించి మిరప సాగు చేశారు. ఎకరానికి 10 క్వింటాళ్ల దిగుబడి వస్తే క్వింటా రూ.14 వేల ధరతో ఎకరానికి రూ.లక్షల అప్పును మూటగట్టుకోవాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు.



అధికారుల తప్పుడు నివేదికలు

పగిడ్యాల 4 హెక్టార్లు, నందికొట్కూరు 10 హెక్టార్లు, జూపాడుబంగ్లా 16 హెక్టార్లు, మిడ్తూరు 32 హెక్టార్లలో ఎండు మిరప సాగు చేశారు. పగిడ్యాల మండలంలోని ఒక్క ముచ్చుమర్రి గ్రామంలోనే వంద ఎకరాలకు పైగా ఎండు మిరప సాగు చేశారు. మిడ్తూరు మండలంలోని పీరుసాహెబ్‌పేట, జలకనూరు, సుంకేసుల, తదితర గ్రామాల్లో ఒక్కో గ్రామంలో 150 ఎకరాల వరకు ఎండు మిరప పంటను రైతులు సాగు చేశారు. అయితే నాలుగు మండలాల్లో 62 ఎకరాల్లో మాత్రమే మిరప పంటను సాగు చేసినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి.



మూడెకరాల్లో రూ.4 లక్షల పెట్టుబడి పెట్టాను



ఎకరన్నర సొంత పొలం, మరో ఎకరన్నర కౌలుకు తీసుకొని మొత్తం మూడు ఎకరాల్లో ఎండు మిరపను సాగు చేశాను. రసాయన ఎరువులు, నీళ్ల మందులు తదితరాలకు ఎకరాకు లక్ష రూపాయల వరకు పెట్టుబడిగా పెట్టాను. కోత ఖర్చు మరో రూ.30 వేలు వచ్చింది. మూడు ఎకరాలకుగాను రూ.4 లక్షల పెట్టుబడి అయింది. వర్షాభావ పరిస్థితులు, తెగుళ్లతో ఎకరాకు ఐదు క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. క్వింటం ధర రూ.14 వేలు పలుకుతోంది. పంటను అమ్మితే రూ.2 లక్షల 10 వేలు వస్తుంది. చివరకు ఒక లక్షా 90 వేల రూపాయల అప్పు మిగిలే పరిస్థితి కనిపిస్తోంది.

\- వెంకటేశ్వర్లు, పీరుసాహెబ్‌పేట, మిడ్తూరు మండలం

జొన్న పంటను కొనుగోలు చేయాలి

- రైతులతో కలిసి కలెక్టర్, జేసీని కలిసిన గౌరు చరిత


కలెక్టర్‌తో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత

నంద్యాల(ఆంధ్రజ్యోతి)/గడివేముల, మార్చి 2: జొన్న పంటను ప్రభుత్వం పూర్తి స్థాయిలో కొనుగోలు చేయాలని మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. మండలంలోని పెసరవాయి, కరిమద్దెల గ్రామాల రైతులతో ఆదివారం నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్‌తో కలిసి గౌరు చరిత సమావేశమయ్యారు. దీంతో జొన్న పంట కొనుగోలులో అధికారులు వివక్ష చూపుతున్నారని, ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేయడం లేదని, అధికార పార్టీ అనునయులకే సంచులు పంపిణీ చేస్తున్నారని రైతులు మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత ముందు వాపోయారు. దీంతో ఆమె రైతులతో కలిసి కలెక్టర్ శ్రీనివాసులు, జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డిలను కలిశారు. మండలంలో జొన్న పంట కొనుగోలులో అధికారులు అవలంబిస్తున్న ఏకపక్ష ధోరణి, గోనె సంచులు ఆర్‌బీకేలకు రాకుండానే వైసీపీ నాయకుల ఇళ్లకు చేరుతున్న వైనంపై కలెక్టర్, జేసీలకు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ధాన్యం పంట కొనుగోలుపై వైసీపీ నాయకులు రాజకీయం చేస్తున్నారని అన్నారు. రైతులు పండించిన జొన్న పంటను పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సీతారామిరెడ్డి, టీడీపీ నాయకులు రామచంద్రారెడ్డి, కృష్ణయాదవ్, ఈశ్వర్‌రెడ్డి, వడ్డు లక్ష్మీదేవి, కాలిద్‌బాషా, సుభద్రమ్మ, సుదర్శన్‌రెడ్డి, బాలీశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

'చిన్నారులకు పోలియో చుక్కలు వేయించండి'

నంద్యాల క్రైం, మార్చి 2: అప్పుడే పుట్టిన శిశువునుంచి 5 సంవత్సరాల్లోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని కలెక్టర్ కె.శ్రీనివాసులు పిలుపునిచ్చారు. ఈ నెల 3న జరిగే పల్స్‌పోలియో కార్యక్రమాన్ని పురస్కరించుకుని శనివారం నంద్యాలలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయం నుంచి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు వేయించాలన్నారు. 3వ తేదీ ఆదివారం పోలియో చుక్కలు వేయించుకోలేని పిల్లలకు 4,5 తేదీల్లో ఇంటింటికి తిరిగి పల్స్‌పోలియో చుక్కలు వేయించాలని వైద్యాధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ వెంకటరమణ, జీజీహెచ్ సూపరింటెండెంట్ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ రైతు వ్యతిరేకి

- మోదీ ప్రభుత్వంలో లక్షల కోట్ల ఎగవేత
- సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ

కర్నూలు(న్యూసిటీ), మార్చి 2: కేంద్రంలో అధికారం చేపట్టినప్పటి నుంచి బీజేపీ రైతులకు వ్యతిరేకంగా పాలన సాగిస్తోందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. దేశంలో, రాష్ట్రంలో బీజేపీని బలపరిచే పార్టీలను ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు. శనివారం ఉమ్మడి కర్నూలు జిల్లా సీపీఐ సర్వసభ్య సమావేశాన్ని నగరంలోని దేవి ఫంక్షన్ హాలులో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నారాయణ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో ఫ్యాక్షనిజం రాజకీయం చేస్తోందన్నారు. కర్నూలు జిల్లా ఎందరో త్యాగపురుషులు లాంటి ఆణిముత్యాలను అందించిందన్నారు. పశ్చిమప్రాంతం నిత్యం కరువు కాటకాలతో అల్లాడుతుంటే పట్టించుకునే ప్రభుత్వాలు లేవన్నారు. పోతిరెడ్డిపాడు నుంచి సోమశిల వరకు సీపీఐ ఆధ్వర్యంలో సైకిల్ యాత్ర చేశామన్నారు. బీజేపీ ప్రభుత్వం రైతులకు వ్యతిరేకంగా చేసిన నల్లచట్టాలను నిరసిస్తూ పోరాటం చేసి మెడలు వంచామన్నారు. మోదీ గ్రాఫ్ పడిపోవడంతో రామాలయాన్ని అడ్డుపెట్టుకుని రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వానికి టీడీపీ,వైసీపీ,జనసేన పార్టీలు సాష్టాంగ నమస్కారం చేస్తున్నాయని ఆరోపించారు. దేశంలో మోదీ అనుచరులు 29 మంది వందలాది కోట్లు ఎగ్గొట్టి పోయారని వారిని ఏ మాత్రం శిక్షించడం లేదని అన్నారు. అందరి చేత పన్నులు వసూలు చేయించి ఏడుగురు గుజరాతీలను దత్తపుత్రులుగా చేసుకుని వారిని రక్షించి విదేశాలకు పారిపోయేటట్లు చేశారని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వంలో అవినీతి హోల్‌సేల్ వ్యాపారంలా తయారైందన్నారు. ఈ సమావేశంలో నంద్యాల, కర్నూలు జిల్లాల కార్యదర్శులు ఎస్.రంగనాయుడు, బి.గిడ్డయ్య, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు కె.రామాంజనేయులు, రామచంద్రయ్య, ఆవుల శేఖర్, రైతు సంఘం నాయకులు కె.జగన్నాథం, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు ఎస్.మునెప్ప, ఎస్ఎన్.రసూల్, లలితమ్మ, గిడ్డమ్మ, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ

అప్పుల ఊబిలో రాష్ట్రం



జగన్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టింది. రానున్న ఎన్నికల్లో ప్రజల పక్షాన నిలబడాలి. దుర్మార్గమైన, స్వార్థపూరిత రాజకీయాలు చేసే మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాలి. మోదీ వచ్చాకనే దేశం ఆర్థికంగా వెనుకబడింది. ప్రజా పక్షాన నిలిచి ఎర్రజెండా దేశాన్ని, రాష్ట్రాన్ని రక్షించే బాధ్యత తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నిత్యావసర ధరలు పెంచేస్తూ ప్రజలు ఏమీ గమనించడం లేదన్న భ్రమలో బీజేపీ ఉందన్నారు.

\- ముప్పాళ్ల నాగేశ్వరరావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి

వనభోజనం ఓ ఆచారం

- పిల్లాపాపలతో కలిసి చెట్ల కింద భోజనం
- 200 ఏళ్లుగా కొనసాగుతున్న ఆనవాయితీ
- ఇలా చేయడం వల్ల మేలు జరుగుతుందని నమ్మకం


పిల్లాపాపలతో వనభోజనం

ఆ ఊరి ప్రజలంతా ఉదయాన్ని ఆరు గంటలకు నిద్ర లేస్తారు. ఇళ్లకు తాళాలు వేసి పిల్లాపాపలతో కలిసి గ్రామ శివార్లలోని చెట్ల కిందకు చేరుకుంటారు. అక్కడే వంట వండుకొని భోజనం చేస్తారు. సాయంత్రం గ్రామానికి చేరుకుని అమ్మవారికి పూజలు నిర్వహించిన అనంతరం తమ ఇళ్లకు వెళ్తారు. ఇంటినంతా శుభ్రం చేసుకొని అనంతరం పూజలు చేస్తారు. 200 ఏళ్ల నాటి ఈ వన భోజన సాంప్రదాయాన్ని గ్రామస్థులు నేటికీ కొనసాగిస్తున్నారు. ఏటా శివరాత్రికి ఐదు రోజుల ముందు ఈ కార్యక్రమం జరుగుతుంది. ఇందులోభాగంగానే శనివారం ఆ గ్రామంలో సందడి కనిపించింది. -మద్దికెర





మండలంలోని బొమ్మనపల్లి గ్రామంలో మొత్తం 250 కుటుంబాలు ఉన్నాయి. దాదాపు గ్రామంలో 1300 ఓట్లు ఉన్నాయి. సుమారు 200 ఏళ్ల క్రితం గ్రామంలో చాలా మందికి సంతానం కలగడం లేదని ఇబ్బందులు పడుతుండే వారు. దీంతో అప్పటి గ్రామ పెద్దలు గ్రామంలోని కాశీంతాత స్వామి దగ్గరకు వెళ్లి సమస్యను ఏకరువు పెట్టారు. మాఘ మాసంలో శివరాత్రికి ఐదు రోజుల ముందు శనివారం రోజున గ్రామస్థులంతా ఇళ్లకు తాళాలు వేసి గ్రామ శివార్లకు వెళ్లి చెట్ల కింద వనభోజనాలు చేసుకోవాలని కాశీంతాత స్వామి చెప్పారు. అలా చేయడం వల్ల సంతానం కలుగుతుందని తెలపడంతో గ్రామస్థులు నాటి నుంచి నేటి వరకు అదే సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగానే శనివారం గ్రామంలోని పిల్లాపాపలు, పెద్దలు అందరూ ఇళ్లకు తాళాలు వేసి వెళ్లారు. గ్రామ శివారులోని ఎవరికి కావాల్సిన వారు ఒక్కో చెట్టు కింద ఉంటూ వంటా వార్పు చేసుకుని వనభోజనం చేశారు. సాయంత్రం చెట్ల కింద ఉన్న వారు అందరూ ఒకే చోటకు చేరుకున్నారు. అఖండ దీపంతో వచ్చి గ్రామంలోని సుంకులమ్మ అమ్మవారికి పూజలు చేసి కాయకర్పూరాలు సమర్పించారు. అనంతరం తమ ఇళ్లకు వెళ్లి శుభ్రం చేసుకున్న తరువాతం ఇంట్లో కూడా పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ తమ గ్రామంలో ఎన్నో ఏళ్లుగా ఈ సాంప్రదాయం కొనసాగుతోందని, ఈ ఆచారాలను పాటించడం వల్ల గ్రామంలో అందరూ సుఖసంతోషాలతో ఉండడమే కాకుండా పిల్లలు లేని వారికి సంతానం కలుగుతోందని తెలిపారు.


గ్రామానికి తిరిగి వస్తున్న ప్రజలు



యువత కూడా పాటిస్తోంది

నాటి పెద్దలు పెట్టిన సాంప్రదాయాన్ని యువత కూడా పాటిస్తోంది. గ్రామ శివారులోకి వెళ్లి ఇలా వనభోజనం చేయడం ఆనందంగా ఉంది. నాటి సాంప్రదాయాలు కొనసాగించడం ఎంతో సంతోషంగా ఉంది. - మనోజ్, గ్రామస్థుడు



నాటి సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నాం

సుమారు 200 ఏళ్ల కిందట నుంచి ఈ సాంప్రదాయం కొనసాగుతోంది. నాటి పెద్దలు ఈ సాంప్రదాయాన్ని అమలు చేసుకుంటూ వచ్చారు. మేము కూడా నేటి వరకు కొనసాగిస్తున్నాం. ఈ సాంప్రదాయం పాటించడం వల్ల గ్రామంలో అంతా మంచే జరుగుతోంది. - ఆంజనేయులు, సర్పంచ్

ఇంటర్ పరీక్షలకు 762 మంది గైర్హాజరు

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 2: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం శనివారం జరిగిన పరీక్షకు కర్నూలు జిల్లా వ్యాప్తంగా 762 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆర్ఐఓ ఎస్వీఎస్ గురువయ్యశెట్టి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మొత్తం 20,410 మంది ఉన్నారు. ఇందులో 19,648 మంది పరీక్షకు హాజరు కాగా, 762 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను ఆర్ఐఓతో పాటు డీవీఈఓ జమీర్‌పాషా, డీఈసీ సభ్యులు తనిఖీ నిర్వహించారు.

నంద్యాల జిల్లాలో 633 మంది..

నంద్యాల (నూనెపల్లె), మార్చి 2: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 52 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా సెకెండియర్ జనరల్ విభాగంలో 10,178 మంది విద్యార్థులకు గాను 9,607 మంది విద్యార్థులు పరీక్షలు వ్రాయగా, 571 మంది గైర్హాజరైనట్లు డీఐఈవో సునీత తెలిపారు. ద్వితీయ సంవత్సర ఒకేషనల్ విభాగానికి సంబంధించి 960 మంది విద్యార్థులకు గాను 898 మంది విద్యార్థులు పరీక్షలు వ్రాయగా 62 మంది గైర్హాజరైనట్లు ఆమె తెలిపారు. జనరల్, ఒకేషనల్ విభాగాలలో మొత్తం 633 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాలేదని చెప్పారు. జిల్లా కేంద్రంలోని ఇంటర్మీడియట్ పలు పరీక్షా కేంద్రాలను కలెక్టర్ కె.శ్రీనివాసులు, ఎస్పీ రఘువీర్‌రెడ్డి తనిఖీ చేసి పరిశీలించారు.

హత్య కేసులో ముగ్గురి అరెస్టు

కర్నూలు, మార్చి 2: వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని జిల్లా కోర్టు సమీపంలో నాలుగు రోజుల కింద జరిగిన సాయికుమార్ హత్య కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. సీసీ కెమెరాల ఆధారంగా ఆటో నెంబరు సాయంతో నిందితులను పట్టుకున్నారు. సాయిబాబా నగర్‌కు చెందిన మల్లెపోగు మధు, బుధవారపేటకు చెందిన జగదీష్, సాయిబాబా సంజీవనగర్‌కు చెందిన నిసార్ అహ్మద్‌లను అరెస్టు చేశారు. నిందితుల నుంచి కత్తి, ఆటోను స్వాధీనం చేసుకున్నారు. మల్లెపోగు మధుపై గతంలో కూడా పలు కేసులు ఉన్నాయి. రౌడీషీట్ కూడా ఉంది. తన కాలనీలో ఉన్న గొడవల కారణంగానే మధు నిరంతరం తన వెంట కత్తి పెట్టుకుని తిరుగుతున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. ఆటోలతో ఒకరికొకరు ఢీకొట్టి హారన్ మోగించడంతోనే ఈ హత్య జరిగినట్లు పోలీసులు శనివారం రాత్రి వెల్లడించారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు.

స్మృతి వనం సమీపంలో పెద్దపులి సంచారం


వెలుగోడు అటవీ ప్రాంతంలో పెద్దపులి పాదముద్రలను సేకరిస్తున్న అటవీ సిబ్బంది

వెలుగోడు, మార్చి 2: నలమల్ల అటవీ ప్రాంతంలోని వెలుగోడు-ఆత్మకూరు రహదారి సమీపాన ఉన్న స్మృతివనం వద్ద శనివారం ఓ పెద్దపులి సంచరించింది. శ్రీశైలానికి పాదయాత్రగా వెళ్తున్న శివ భక్తులకు రోడ్డు దాటుతూ పెద్దపులి కంటబడింది. దీంతో వారు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. హెచ్చరిక బోర్డులపై ఏర్పాటు చేసిన అటవీ అధికారుల ఫోన్ చేసి సమాచారం అందించారు. దీంతో వెలుగోడు అటవీశాఖ అధికారి ఎంఏ ఖాన్ సిబ్బందితో ఆ ప్రాంతానికి చేరుకొని పెద్దపులి అడుగు జాడలను సేకరించారు. పెద్దపులి అడుగులుగా నిర్ధారించారు. పులులు అటవీ ప్రాంతంలో సహజంగానే తిరుగుతుంటాయని, రోడ్లు దాటే సమయంలో కనబడటం సహజమేనని తెలిపారు.

రబీలోనూ కరువే..

17 మండలాల్లో దుర్భిక్షం ఉందని నివేదిక

కర్నూలు(అగ్రికల్చర్), మార్చి 2: గత సంవత్సరం ఖరీఫ్‌లో 30 మండలాల్లో కరువు పరిస్థితులు నెలకొన్నాయని ప్రభుత్వం తేల్చింది. ఉమ్మడి జిల్లాలో పంట నష్టపరిహారాన్ని అందించేందుకు కలెక్టర్ డా.జి.సృజన నివేదికను ప్రభుత్వానికి అందజేశారు. ఢిల్లీ నుంచి కేంద్ర బృందం అధికారులు కూడా ఉమ్మడి కర్నూలు జిల్లాలో నెలకొన్న కరువు పరిస్థితులను పరిశీలించారు. తప్పకుండా సాయం అందిస్తామని వారు రైతులకు హామీ ఇచ్చారు. ప్రస్తుతం రబీ సీజన్‌లో కూడా తీవ్రమైన వర్షాభావ పరిస్థితులు వెంటాడటంతో 17 మండలాల్లో కరువు పరిస్థితులు నెలకొన్నాయని వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి ప్రభుత్వానికి నివేదిక పంపారు. కల్లూరు, గూడూరు, మంత్రాలయం, వెల్దుర్తి, కర్నూలు రూరల్, కర్నూలు అర్బన్, కోడుమూరు, ఆదోని, ఓర్వకల్లు, హాలహర్వి, ఆలూరు, ఆస్పరి, తుగ్గలి, మద్దికెర, చిప్పగిరి, హొళగుంద, పత్తికొండ మండలాల్లో కరువు పరిస్థితులు నెలకొన్నట్లు వ్యవసాయ శాఖ నిర్ధారించింది. పత్తికొండ, చిప్పగిరి మండలాల్లో మధ్యస్థంగా, మిగిలిన 15 మండలాల్లో తీవ్ర కరువు పరిస్థితులు ఉన్నట్లు ప్రభుత్వానికి నివేదిక పంపారు. రబీ సీజన్‌లో ప్రధానంగా శనగ, మొక్కజొన్న, కొర్ర, మిరప, టమోటా తదితర పంటలను రైతులు సాగు చేశారు. ఖరీఫ్‌తో పాటు రబీ సీజన్‌లో ప్రభుత్వం గుర్తించిన మండలాల్లో తక్షణమే ఇన్‌పుట్ సబ్సిడీని వెంటనే అందించాలని రైతు సంఘం నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

బీహార్ యువకుడి ఆత్మహత్య

పాణ్యం మార్చి 2: మండలంలోని కందికాయపల్లి సుంకులమ్మ దేవాలయం సమీపంలో బీహార్‌కుచెందిన బబ్లూకుమార్ (21) ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ అశోక్ తెలిపారు. నాలుగు రోజుల క్రితం బబ్లూకుమార్ కందికాయపల్లి సోలార్‌లో పని చేస్తున్న తన బావ రాంకుమార్‌ను చూసేందుకు బబ్లూకుమార్ వచ్చాడని ఎస్ఐ తెలిపారు. ఈనెల ఒకటో తేదీ శనివారం బయటకు వెళ్లిన బబ్లూ ఎంతసేపటికి రాకపోవడంతో బంధువులు సమీప ప్రాంతాల్లో గాలించారన్నారు. శనివారం ఉదయం చెట్టుకు టవల్‌తో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మృతుడు బీహార్ రాష్ట్రం గోపాల్‌గంజ్ జిల్లా, కరారియా గ్రామానికి చెందిన సుదామయాదవ్ కుమారుడన్నారు. బంధువుల రాకకోసం మృతదేహాన్ని నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించామన్నారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉందన్నారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కుక్కల దాడిలో 20 గొర్రె పిల్లల మృతి

కోసిగి, మార్చి 2: కుక్కల దాడిలో శనివారం 20 గొరైల పిల్లలు చనిపోయాయి. మండల పరిధిలోని జంపాపురం గ్రామంలో ఈ ఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కర్రి బసప్ప, చెన్న బసప్ప, నాగరాజు, బీరప్పలకు సంబంధించిన వీటి విలువ దాదాపు రూ.2లక్షల మేర ఉంటుంది. ప్రభుత్వం గొరైల పెంపకందారులకు బీమా సౌకర్యం కల్పించి ఆదుకోవాలని ఏపీ గొరైల, మేకల పెంపకందారుల ఫెడరేషన్ నాయకులు వీరనాగప్ప, రాముడు కోరారు.

వైసీపీని గద్దె దించడం ఖాయం

- కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి
- టీడీపీలో చేరిన వైసీపీ ముస్లిం మైనార్టీ నాయకులు

డోన్, మార్చి 2: రాబోవు ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వాన్ని ప్రజలు గద్దె దింపడం ఖాయమని కేంద్ర మాజీ మంత్రి, డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం పట్టణంలో కోట్ల విస్తృతంగా పర్యటించారు. మాజీ జడ్పీటీసీ కేఈ జయన్న, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోట్రికే ఫణిరాజ్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడు, మాజీ ఉప సర్పంచ్ కేశవ భట్, సుధీష్ రాజు, ఐటి శివ తదితరుల ఇళ్లకు వెళ్లి టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు వై.నాగేశ్వరరావు యాదవ్, వలసల రామకృష్ణ, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ లక్కసాగరం లక్ష్మీరెడ్డి, ఓబులాపురం శేషిరెడ్డి, మచ్చ రమణతో కలిసి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి ఎన్నికలపై చర్చించారు.. అదేవిధంగా మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రికే హరికిషన్ నివాసానికి వెళ్లి మద్దతు కోరారు. అనంతరం కోట్ల మాట్లాడుతూ సీఎం జగన్ రాష్ట్రాన్ని దోచుకోవడం తప్ప.. చేసిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. ప్రజలపై పన్నుల భారంతోపాటు అన్ని నిత్యావసర ధరలు పెంచేసి ఆర్థికంగా దెబ్బ తీస్తున్నాడని మండిపడ్డారు. టీడీపీ అధినేత చంద్రబాబు అమలు చేసిన ఎన్నో సంక్షేమ పథకాలను వైసీపీ ప్రభుత్వం రద్దు చేసి పేదల కడుపు కొట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. డోన్ నియోజకవర్గంలో ప్రజలకు ఏమి మేలు జరిగిందో చెప్పాలన్నారు. కరువుతో నష్టపోయిన రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత మంత్రి బుగ్గనకు లేదా అని ప్రశ్నించారు. టీడీపీ, జనసేన కూటమి తిరుగులేని విజయం సాధిస్తాయని కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి విజయభట్టు, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్, ప్యాపిలి మండల అధ్యక్షుడు గండికోట రామసుబ్బయ్య, సీనియర్ న్యాయవాది శ్రీనివాస్‌భట్, భాస్కర్ నాయుడు, పట్టణ టీడీపీ కార్యదర్శి ఎస్ఎండీ రఫి, ఓంప్రకాష్, రంజిత్‌కిరణ్, ఎల్లగౌడు పాల్గొన్నారు.


కోట్ల సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ ముస్లిం మైనార్టీ నాయకులు

టీడీపీలో చేరిన వైసీపీ ముస్లిం మైనార్టీ నాయకులు: డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి సమక్షంలో వైసీపీ ముస్లిం మైనార్టీ నాయకులు అన్వర్‌బాషా, ఖలీల్, అహ్మద్, దేవరాజు, అబ్దుల్, అహ్మద్, మహ్మద్ హుశేన్, అబ్దుల్ రషీద్, నజీర్ అహ్మద్ తదితరులు టీడీపీలో చేరారు. అదే విదంగా పట్టణానికి చెందిన సాయినాథ్‌రెడ్డి, జగదీష్, మణిదీప్ తదితరులు టీడీపీలో చేరారు. ముస్లిం మైనార్టీల్లో ఎంతో పట్టున్న అన్వర్‌బాషా కుటుంబం టీడీపీలో చేరి మద్దతు పలకడం ఎంతో సంతోషంగా ఉందని కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు.

కానిస్టేబుల్ హత్య కేసులో ఏ-2 అరెస్టు

18 నెలల తరువాత పట్టుబడిన నిందితుడు

నంద్యాల క్రైం, మార్చి 2: నంద్యాల పట్టణంలో రెండేళ్ల క్రితం సంచలనం సృష్టించిన కానిస్టేబుల్ సురేంద్ర హత్య కేసులో 2వ నిందితుడు సాకే రాజ్‌కుమార్ అలియాస్ పెద్దిని పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. గత 18 నెలలుగా పోలీసుల కళ్లుగప్పి తప్పించుకు తిరుగుతున్న సాకే రాజ్‌కుమార్ అలియాస్ పెద్దిని ఎస్పీ రఘువీర్‌రెడ్డి ఆదేశాల మేరకు నంద్యాల జిల్లా పోలీసులు విస్తృతంగా గాలించి అరెస్ట్ చేశారు. నంద్యాల పట్టణంలోని రాణి-మహారాణి థియేటర్ సమీపంలోని కుందూ నది బ్రిడ్జి వద్ద తచ్చాడుతున్న నిందితుడిని నంద్యాల రెండో పట్టణ ఇన్‌స్పెక్టర్ రాజారెడ్డి తన సిబ్బందితో అరెస్టు చేశారు. 07-08-2022వ తేదీన పోలీస్ కానిస్టేబుల్ సురేంద్రను రౌడీషీటర్లు దారుణంగా హత్య చేసిన విషయం విదితమే. ఈ కేసులో నిందితుడు సాకే రాజ్‌కుమార్ అలియాస్ పెద్ది రెండో నిందితుడు. కానిస్టేబుల్ హత్య కేసులో మొదటి నిందితుడు వెంకటసాయి అలియాస్ కవ్వతో సహా ఎనిమిది మంది నిందితులను గతంలోనే పోలీసులు అరెస్ట్ చేశారు. అయితే రెండో ముద్దాయి సాకే రాజ్‌కుమార్ పోలీసులకు పట్టుబడకుండా తప్పించుకు తిరుగుతుండేవాడు. ఎట్టకేలకు నిందితుడిని ఏడాదిన్నర తర్వాత పోలీసులు అరెస్ట్ చేశారు.

హుశేనాపురంలో చోరీ

నగదు, బంగారు అపహరణ

ఓర్వకల్లు, మార్చి 2: నగరంలోని హుశేనాపురం గ్రామానికి చెందిన రమణమ్మ ఇంట్లో దొంగలు పడ్డారు. తలుపులు పగులకొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. బీరువాను పగులకొట్టి అందులో ఉన్న నగదు, బంగారాన్ని అపహరించుకుపోయారు. బాధితురాలు రమణమ్మ అనారోగ్యం కారణంగా ఆళ్లగడ్డ ఆసుపత్రిలో చూపించుకుని బంధువుల ఇంటి వద్ద ఉండి శనివారం ఉదయం హుశేనాపురం గ్రామానికి చేరుకుంది. ఆమె ఇంటి తలుపులు, బీరువాను పగులకొట్టిడం చూసి నివ్వెరపోయింది. ఇంట్లో ఉన్న రూ.లక్ష నగదు, రెండున్నర తులాల బంగారం నెక్లెస్, రూ.1.50 లక్షల బాండ్లు, ఇంటి పత్రాలు దొంగలు అపహరించుకు వెళ్లారని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

యువకుడిపై దాడి

నలుగురిపై కేసు నమోదు

చాగలమర్రి, మార్చి 2: చాగలమర్రిలోని మల్లెవేముల బస్టాండు సమీపంలో మద్యం సేవించి నలుగురు యువకులు అబ్దుల్లా అనే యువకుడిపై దాడి చేశారని ఎస్ఐ రమణయ్య తెలిపారు. గ్రామానికి చెందిన జుబేరు, రింకు, చంద్ర, ముజహిద్ అనే యువకులపై కేసు నమోదు చేశామని అన్నారు. ఈనెల 1వ తేదీ రాత్రి మల్లెవేముల బస్టాండు సమీపంలో అబ్దుల్లా అనే యువకుడు తన స్నేహితుడితో ఘర్షణ పడిన యువకులను ప్రశ్నించేందుకు వెళ్లాడు. అప్పటికే మద్యం సేవించి ఉన్న వారు అబ్దుల్లాపై రాయితో దాడి చేసి గాయపరిచారని అన్నారు. గాయపడ్డ యువకుడు అబ్దుల్లా వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని అన్నారు.

భక్తులపై భారం

మహానందీశ్వరుడి ప్రసాదం ధర పెంపు

మహానంది,మార్చి 2: మహానంది క్షేత్రానికి వచ్చే భక్తులకు ఆలయంలో విక్రయించే లడ్డూ, వడ ప్రసాదాల ధరలను ఆదివారం నుంచి పెంచుతున్నట్లు ఆలయ ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి శనివారం రాత్రి తెలిపారు. రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు క్షేత్రంలో భక్తులకు విక్రయించే ప్రసాదం ధరలను పెంపొందించినట్లు చెప్పారు. ఇందులో గతంలో వంద గ్రాముల లడ్డును రూ.15 భక్తులకు కౌంటర్ ద్వారా విక్రయించేవారు. పెరిగిన ధరల ప్రకారం రూ.20, 400 గ్రాముల అభిషేకం లడ్డును రూ.75 నుండి వంద రూపాయలకు, వడ ప్రసాదాన్ని రూ.15 నుండి రూ.20 ప్రకారం భక్తులకు విక్రయిస్తామని చెప్పారు.

మద్యం బాటిళ్లు సీజ్

కోవెలకుంట్ల, మార్చి 2: కోవెలకుంట్ల మండలంలో 83 మద్యం బాటిళ్లు సీజ్ చేసినట్లు సెబ సీఐ వర్ధనాదేవి నంద్యాల సెబ్ సీఐ విజయకుమార్ శనివారం తెలిపారు. రేవనూరులో నవీన్‌గౌడ్ వద్ద 26 మద్యం బాటిళ్లు, కోవెలకుంట్ల ఎల్ఎం కాంపౌండ్ వద్ద రంగడు వద్ద 25 మద్యం బాటిళ్లు, జమ్మల మడుగు క్రాస్ రోడ్డు వద్ద జాఫర్ అనే వ్యక్తి వద్ద 32 మద్యం బాటిళ్లు సీజ్ చేసినట్లు వారు తెలిపారు. నిందితులను అరెస్టు చేసినట్లు వారు చెప్పారు.

జిజ్ఞాసతో చదవాలి

- కవి నగ్నముని

కర్నూలు(కల్చరల్), మార్చి 2: సాహిత్యాన్ని ప్రత్యేకమైన జిజ్ఞాసతో చదవాలని, అందులో కొత్త కోణాన్ని పరిశోధించాలని సుప్రసిద్ధ కవి నగ్నముని అన్నారు. శనివారం రాత్రి నగరంలోని టీజీవీ కళా క్షేత్రంలో సాహితీ స్రవంతి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లాకు చెందిన ప్రముఖ రచయిత మువ్వా శ్రీనివాసరావు రాసిన 'అనితరుడు' పుస్తక పరిచ య సభ నిర్వహించారు. సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు అధ్యక్షతన జరిగిన సభలో నగ్నముని మాట్లాడారు. ఇతర కళలు, కవిత్వ రచనకు చాలా తేడా ఉందని, ఏ గురువూ లేని కళ కవిత్వమైతే, కవి స్వయంభూ వంటి వాడని చెప్పారు. కవిత్వానికి అనేక కోణా లు ఉంటాయని, వాటిని అందిపుచ్చుకోవాలని సూచించారు. ప్రముఖ కవి మువ్వా శ్రీని వాసరావు రాసిన అనితరుడు పుస్తకంలో ఆయన రాసిన నాలుగు పుస్తకాలతోపాటు, 366 మంది అనేక కోణాల్లో రాసిన వ్యాసాలు దర్శన మిస్తాయని అన్నారు. ఈ పుస్తకం కూడా తెలుగు సాహిత్యంతో ఒక చరిత్ర ఘట్టంగా నిలిచిపోతుందని చెప్పడంలో సందేహం లేదని అన్నారు. సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్ మాట్లాడుతూ వస్తు శిల్ప వైవిధ్యాలన్ని మువ్వా రచనల్లో చూస్తామని, లోతైన కవిత్వం మువ్వాకే సాధ్యమైందని అన్నారు. కవి వెంకట కృష్ణ మాట్లాడుతూ కవితన రచనలను సమాజానికి పరిచయం చేయడంతోపాటు మంచి సందేశం ఇచ్చేలా కృషి చేయాలని, ఆ ప్రయత్నం మువ్వా శ్రీనివాసరావు చేశారని కొనియాడారు. ఈ సభలో పుస్తక రచయిత మువ్వా శ్రీనివాసరావు, కథా రచయిత ఇనాయతుల్లా, విరసం నాయకుడు నాగేశ్వరా చారి, సాహితీ స్రవంతి జిల్లా గౌరవాధ్యక్షుడు బసవరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి అవుల చక్రపాణి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


ప్రసంగిస్తున్నకవి నగ్నముని


యువకుడి బలవన్మరణం


పవన్‌కుమార్ (ఫైల్)

దేవనకొండ,మార్చి 2: చదువు పూర్తి చేసి ఉద్యోగం కోసం ప్రయత్నిస్తే ఫలితం లేదు. పేదరికంతో పాటు శ్వాసకోశ వ్యాధులు వెంటాడాయి. దీంతో చివరకు జీవితంపై విరక్తి చెందిన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన దేవనకొండ మండలంలో శనివారం చోటు చేసుకుంది. మండలంలోని పి.కోటకొండకు చెందిన కమ్మరి పవన్ కుమార్ (21) అనే యువకుడు శనివారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పి.కోటకొండకు చెందిన కమ్మరి వెంకటేష్, పుష్పావతి దంపతుల కుమారుడు పవన్ కుమార్ డిప్లమో ఇన్ అగ్రికల్చర్ కోర్సు పూర్తి చేశాడు. ఇదే క్రమంలో కొంత కాలంగా పవన్ కుమార్ అనారోగ్యంతో బాధపడుతూ ఉండేవాడు. ఓ వైపు నిరుద్యోగం, మరో వైపు అనారోగ్యం బాధలు భరించలేకపోయిన పవన్ కుమార్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు కోడుమూరు మండలం వర్కూరులో జరుగుతున్న ఉరుసు వేడుకలకు వెళ్లారు. ఇంటిపక్కనే ఉన్న బంధువులు పవన్ మృతదేహాన్ని గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. దేవనకొండ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తుండ్లవాగు రిజర్వాయరులో పడి వ్యక్తి మృతి

రుద్రవరం, మార్చి 2: నల్లమల అడవిలోని తుండ్లవాగు రిజర్వాయరులో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. రాము (40) అనే వ్యక్తి తుండ్లవాగు రిజర్వాయరులో చేపలు పట్టడానికి వెళ్లాడు. తమిళనాడు నుంచి వలస వచ్చి అహోబిలంలో ఉంటూ గైడ్‌గా పని చేస్తున్నాడు. శని, ఆదివారాల్లో భక్తులకు అహోబిలం చరిత్ర గురించి వివరిస్తూ జీవిస్తున్నాడు. చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు రిజర్వాయరులో పడి మృతి చెందాడని ఎస్ఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఫిర్యాదు అందలేదని, అందిన వెంటనే కేసు నమోదు చేస్తామని తెలిపారు.



నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

సునీత ప్రశ్నలపై జగన్ నోరు విప్పాలి

● మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి

ఆత్మకూరు, మార్చి 2: వివేకా హత్య కేసులో ఆయన కుమార్తె సునీతా రెడ్డి అడిగిన ప్రశ్నలకు సీఎం జగన్ నోరువిప్పి సమాధానాలు చెప్పాలని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 2019 మార్చి 14వ తేదీ అర్ధరాత్రి బాబాయిని హత్య చేసింది ఎవరో సీఎం జగన్‌కు తెలుసని ఆయన చెల్లెలే సునీత ఢిల్లీలో ప్రెస్‌మీట్ పెట్టి చెప్పారని అన్నారు. అయితే అందుకు సీఎం జగన్‌కు సమాధానం చెప్ప ధైర్యమే లేకపోయిందని విమర్శించారు. గతంలో వివేకా హత్య గురించి టీడీపీ తరపున తాము అడిగిన ప్రశ్నలకు కూడా సమాధానాలు చెప్పలేకపోయారన్నారు. అంతేకాకుండా విచారణ అధికారులను, అప్రూవర్‌గా మారిన దస్తగిరిని బెదిరించలేదా? అని ప్రశ్నించారు. జగన్‌కు నిజంగా నైతిక విలువలు ఉన్నట్లయితే సునీత అడిగిన ప్రశ్నలకు వెంటనే సమాధానం చెప్పాలన్నారు. లేకపోతే వివేకా హత్యా నిందుతులెవరో సీఎం జగన్‌కు తెలసని తాము భావించాల్సి ఉంటుందని అన్నారు.

భక్తురాలికి పర్సు అప్పగింత

మహానంది, మార్చి 2: మహానంది క్షేత్రానికి దైవదర్శనం కోసం వచ్చి ఆలయ పరిసరాల్లో పొరపాటున పర్సు పోగొట్టుకున్న భక్తురాలికి తిరిగి దేవస్థానం ఉద్యోగులు అప్పగించారు. శనివారం హైదరాబాద్‌కు చెందిన సుశీలమ్మ అనే భక్తురాలు మహానందీశ్వరుని దర్శనం కోసం వచ్చారు. ఆలయం ప్రాంగణంలో రూ.4,600 నగదుతో ఉన్న పర్సును పోగొట్టుకున్నారు. బసవరాజు, శివ అనే భక్తులకు ఈ పర్సు దొరికింది. ఆలయ సమాచార కేంద్రంలో అప్పగించడంతో భక్తురాలికి టెంపుల్ ఇన్‌స్పెక్టర్ రంగన్న ద్వారా అప్పగించారు. వీరి వెంట హోంగార్డు బాలుడు, ఏజెన్సీ ఉద్యోగి మధు పాల్గొన్నారు.

'సీఎం సభకు బడి బస్సులు మళ్లించడం సరికాదు'



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఆత్మకూరు, మార్చి 2: ఉమ్మడి కర్నూలు జిల్లాలో సోమవారం జరిగే సీఎం జగన్ పర్యటనలకు ప్రైవేట్ స్కూల్స్ బస్సులను మళ్లించాలని విద్యాశాఖాధికారులు నిర్ణయించడం సరికాదని ఎస్ఎఫ్ఐ నాయకులు దినేష్ కుమార్ అన్నారు. శనివారం ఆత్మకూరులో ఆ సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. 4న జరిగే సీఎం సభ నేపథ్యంలో బడి బస్సులను తరలించాలన్న ఉద్దేశంతో ఆదివారం పాఠశాలలను నిర్వహించి సోమవారం సెలవు ఇవ్వాలని విద్యాశాఖాధికారులే ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలకు సూచించడం సిగ్గుచేటని విమర్శించారు. గతంలో కూడా స్కూల్ బస్సులను నిబంధనలకు విరుద్ధంగా రాజకీయ సభలకు ఉపయోగించడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. ఇదిలావుంటే ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభం అయ్యాయని, ఆర్టీసీ బస్సులను సీఎం సభకు మళ్లిస్తే పరీక్ష రాసే విద్యార్థులు ఇబ్బందులకు గురికావాల్సి ఉంటుం దని చెప్పారు. రాజకీయ సభల కోసం నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరి స్తున్న డీఈవో సుధాకర రెడ్డిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

ముగిసిన సదస్సు



సర్టిఫికెట్లు అందజేస్తున్న డైరెక్టర్

పాణ్యం, మార్చి 2: మండలంలోని ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో ప్రారంభమైన రెండు రోజుల జాతీయ సాంకేతిక సదస్సు సంకల్ప్ 2024 శనివారం ముగిసింది. మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సులో ఉమ్మడి జిల్లాలకు చెందిన ఇంజనీరింగ్ కళాశాలలకు చెందిన 1026 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు సదస్సు కన్వీనర్ డాక్టర్ తిరుపతి రెడ్డి తెలిపారు. సాంకేతిక పేపరు ప్రదర్శనలో అగ్రికల్చర్ ఇంజనీరింగ్ అంశానికి పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ప్రథమ స్థానం, స్మార్ట్ హెల్మెట్ అంశానికి ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలకు ద్వితీయ స్థానం సాధించినట్లు తెలిపారు. కోడింగ్, టెక్ క్విజ్, ప్రాజెక్ట్ ఎక్స్‌పో, సీఎస్‌సి, ఎన్‌డీటీ వర్క్‌షాప్, రంగోళి, నృత్యం, గానం, ట్రెజర్ హంట్, క్యాప్చరిక్, లఘు చిత్రాల తయారీ, డిజైన్స్, క్యారమ్స్ తదితర అంశాలలో పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన వివిధ రకాల స్టాళ్లు ఆకట్టుకున్నాయి. విద్యార్థుల ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో కళాశాల ఎండీ శివరాం, డైరెక్టర్ డాక్టర్ అశోక్‌కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ జయచంద్ర ప్రసాద్, కన్వీనర్ డాక్టర్ మనోజ్ పాంచాల్, డాక్టర్ రామిరెడ్డి పాల్గొన్నారు.

పోలియో మహమ్మారిని తరిమేద్దాం

● ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలి ● వైద్యాధికారుల పిలుపు ● నేడు పల్స్ పోలియో కార్యక్రమం



బండిఆత్మకూరులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



కొత్తపల్లిలో..

కొత్తపల్లి, మార్చి 2: ఐదు సంవత్సరాలలోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేసి మహమ్మారిని తరిమికొడుదామని కొత్తపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి దీపానాగవేషి, సీహెచ్‌వో బాలకృష్ణ పిలుపునిచ్చారు. శనివారం కొత్తపల్లి, దుద్యాల గ్రామాల్లోని ఆయా పాఠశాలల విద్యార్థులతో కలిసి వైద్యాధికారులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయా గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో మానవహారం ఏర్పాటు చేశారు. పాఠశాలల ఉపాధ్యాయులు, వైద్యసిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పాములపాడు: పాములపాడులో ఆదివారం నిర్వహించే పల్స్‌పోలియోపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. శనివారం మండల వైద్యాధికారి గులాబ్‌షా ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులచే గ్రామంలో చిన్నారుల జీవితానికి పోలియో రాకుండా రెండు పోలియో చుక్కలు వేయించాలని వినాదాలు చేశారు. సేవాభారతి అధ్యక్షుడు షర్ఫుద్దీన్ అలీ, ఆయుర్వేద వైద్యాధికారి సావిత్రి, ఉపాధ్యాయులు, మాల మహానాడు నాయకులు అంకన్న వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

బండిఆత్మకూరు: పిల్లల నిండు జీవితానికి రెండే రెండు పోలియో చుక్కలు వేయించాలని డాక్టర్ భావన, డాక్టర్ కిరణ్ కుమార్ సూచించారు. శనివారం బండిఆత్మకూరు, నారాయణపురం ఆసుపత్రుల పరిధిలో ఆదివారం జాతీయ పోలియో దినోత్సవ నిర్వహణను పురష్కరించుకుని వైద్యులు, సిబ్బంది, ఆశావర్కర్లు ర్యాలీలు నిర్వహించారు. డాక్టర్‌లు సవిత, దినేష్‌బాబు, సూపర్ వైజర్ వెంకట శివన్న, మాధవి, రమణాబాయి, రామ సుబ్బమ్మ పాల్గొన్నారు.

వెలుగోడు: మండలంలోని వేల్పనూరు గ్రామంలో వైద్యసిబ్బంది పల్స్ పోలియోపై ర్యాలీ నిర్వహించారు. శనివారం వైద్యాదికారి జహీర్ వలీ, ఆధ్వర్యంలో వేల్పనూరు. రేగడగూడూరు, అబ్దుల్లాపురం గ్రామాలలో పాఠశాల విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మహానంది: మండలంలోని తిమ్మాపురం జడ్పీ పాఠశాల విద్యార్థులతో స్థానిక పీహెచ్‌సీ వైద్య సిబ్బంది గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఎంపీహెచ్‌ఈవో ఉసేన్‌రెడ్డి, హెచ్‌ఎం నారాయణ, ఉపాధ్యాయిలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నందికొట్కూరు: అప్పుడే పుట్టిన పిల్లలను మొదలుకొని ఐదేళ్లలోపు పిల్లలకపోలియో చుక్కలు వేయించాలని డా. షైని ప్రియాంక సూచించారు. శనివారం ఆమె మాట్లాడుతూ పోలియో చుక్కలు వేసేందుకు పట్టణంలో 25 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. ఆదివారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలియో చుక్కలు వేస్తారని చెప్పారు.

ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో ఆదివారం నిర్వహించే పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ హరిప్రసాద్, అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారిణి సాజిదా ఫిర్దోస్ పిలుపినిచ్చారు. శనివారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఐదేళ్లలోపు 4553 మంది పిల్లలు ఉన్నట్లు అంచనా వేశామని, వీరందరి కోసం పట్టణంలో 25 పోలియో సెంటర్లతో పాటు ఒక మొబైల్ కేంద్రం ద్వారా పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. కంటి వైద్య నిపుణులు షేక్షావలి, టీబీ సూపర్‌వైజర్ రవికుమార్, సిబ్బంది ఉన్నారు.

మట్టిని అక్రమంగా తరలిస్తున్న ఎమ్మెల్యే అనుచరులు

● టీడీపీ నాయకుల నిరసన

నంద్యాల (నూనెపల్లె), మార్చి 2: నంద్యాలలో ఎమ్మెల్యే శిల్పా రవి చంద్రకిషోర్‌రెడ్డి ముఖ్య అనుచరుల అక్రమ మట్టి రవాణా యథేచ్ఛగా సాగుతోందని, అధికారులు అడ్డుకట్ట ఎందుకు వేయలేకపోతున్నారని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, నంద్యాల ఇన్‌చార్జి ఎన్ఎండీ ఫరూక్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రముఖ న్యాయవాది తాతిరెడ్డి తులసిరెడ్డి ప్రశ్నించారు. నంద్యాల పట్టణ శివారుల్లోని కుందూ నది పరివాహక ప్రాంతంలో మట్టి తవ్వకాల స్థావరాలకు శనివారం టీడీపీ నాయకులు, మాజీ కౌన్సిలర్లు వెళ్లి పరిశీలించి నిరసన వ్యక్తం చేశారు. నాయకులు మాట్లాడుతూ అధికారం చేతిలో ఉందని మట్టి మాఫియా నాయకులు రెచ్చిపోతున్నారని, టిప్పర్లతో మట్టిని అక్రమంగా తరలిస్తూ రూ.కోట్లు దండుకుంటున్నారని మండిపడ్డారు. జిల్లా యంత్రాంగం చూసీ చూడనట్లుగా వ్యవహరించడంపై అంతర్యమేమిటని ప్రశ్నించారు. మట్టి, బియ్యం మాఫియా, అక్రమ మద్యం రవాణాను తన అనుచరులు యథేచ్ఛగా చేస్తున్నారంటే క్రైంను స్థానిక ఎమ్మెల్యే ప్రోత్సహిస్తున్నట్లేనని విమర్శించారు. ప్రజల సమస్యలను పరిష్కరించ కుండా, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయకుండా దోచుకోవడం, దాచుకోవడమే వైసీపీ నాయకులకు తెలుసునని ధ్వజమెత్తారు. అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. నిరసనలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్, టీడీపీ సీనియర్ నాయకుడు చింతల సుబ్బరాయుడు, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.



నంద్యాల పట్టణ శివారులోని మట్టి తవ్వకం ప్రాంతంలో మాట్లాడుతున్న ఫరూక్, తులసిరెడ్డి

'స్థలాలు తిరిగి ఇవ్వాలి'



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

ఆత్మకూరు, మార్చి 2: ఆత్మకూరు పట్టణ శివార్లలోని జగనన్న కాలనీ మీదుగా వెళ్లే కల్వకుర్తి-నంద్యాల 167 జాతీయ రహదారి ఏర్పాటులో ఇళ్లస్థలాలు కోల్పోయిన వారికి ప్రభుత్వం తిరిగి పంపిణీ చేయాలని సీపీఎం నాయకులు రణధీర్, రామ్‌నాయక్‌లు డిమాండ్ చేశారు. ఆత్మకూరులోని ఆ పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణ శివార్లలోని చక్రం హోటల్ వెనక భాగాన గల జగనన్న లేఔట్ మీదుగా కల్వకుర్తి-నంద్యాల జాతీయ రహదారి వెళ్లడం వల్ల కొంత మంది లబ్ధిదారులు ఇళ్ల స్థలాలు కోల్పోవాల్సి వచ్చిందని అన్నారు. అయితే నెలల గడుస్తున్నా ఇంతవరకు వారికి తిరిగి స్థలాలు ఇవ్వకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని చెప్పారు. తక్షణమే బాధిత లబ్ధిదారులకు స్థలాలను ఇవ్వాలని, ఒకవేళ కోల్పోయిన స్థలాల్లో ఏవైనా నిర్మాణాలు జరిగి ఉంటే అందుకు పరిహారం కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

'పంట నమోదు చేసుకోవాలి'

కొత్తపల్లి, మార్చి 2: రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలను నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి మహేష్ సూచించారు. గువ్వలకుంట్ల రైతు భరోసా కేంద్రంలో శనివారం సామాజిక తనిఖీపై గ్రామ సభ ఎంపీడీవో జవహర్‌బాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈవో మాట్లాడుతూ పంట నమోదు చేసుకోవడం వల్ల ప్రభుత్వం ద్వారా అందించే ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా, సున్నా వడ్డీ, పంట రుణాలు, మద్దతు ధర వంటి పథకాలు వర్తిస్తాయన్నారు. అలాగే రబీ సీజన్‌లో రైతులు సాగు చేసిన పంటలు నమోదు చేసి ఈకేవైసీ కూడా పూర్తి చేసినట్లు తెలిపారు. పంట నమోదులో ఏమైనా పొరపాట్లు ఉంటే ఈ నెల 7లోపు మార్పులు, చేర్పులను రైతు భరోసా కేంద్రంలో చేసుకో వచ్చని రైతులకు సూచించారు. వీఆర్వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ

నందికొట్కూరు, మార్చి 2: నందికొట్కూరు మున్సిపాలిటీ పరిధిలో జై కిసాన్ పార్కులో మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ టి.సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి దార సుధీర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సోమేశ్వరిదేవి, కౌన్సిలర్‌లు చాంద్‌బాషా, రాజు, అల్లూరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: మండలంలోని గువ్వలకుంట్ల గ్రామంలో 108 మందికి ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలు ఎంపీడీవో జవహర్‌బాబు, జడ్పీటీసీ సోముల సుధాకర్ రెడ్డి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. శనివారం గువ్వలకుంట్ల గ్రామ సచివాలయంలో వీఆర్వో చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీలో ఎంపీడీవో, జడ్పీటీసీలు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ గువ్వలకుంట్ల గ్రామ పంచాయతీలలో 192 మందికి పట్టాలు పంపిణీ చేయాల్సి ఉండగా.. ప్రస్తుతం 108 మందికి అందజేసినట్లు తెలిపారు. నాయకులు కె.సుధాకర్ రెడ్డి, మహబూబ్‌బాషా, నాగలక్ష్మీ రెడ్డి, సర్పంచ్ భోరెడ్డి సరస్వతమ్మ, పంచాయతీ సెక్రటరీ చాందిని, ఎంపీటీసీ స్రవంతి పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

మహానంది, మార్చి 2: మహానంది మండలం గాజులపల్లి ఆర్ఎస్ సమీపంలో తొమ్మిది మంది పేకాటరాయిళ్లను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. శనివారం గాజులపల్లి ఆర్ఎస్‌లో కొంత మంది వ్యక్తులు పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు సిబ్బంది సహాయంతో దాడులు నిర్వహించి 9 మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకొని రూ.80 వేలు స్వాధీనం చేసుకొన్నట్లు చెప్పారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

టీడీపీ లీగల్ సెల్ కార్యాలయం ప్రారంభం

నంద్యాల (నూనెపల్లె), మార్చి 2: నంద్యాలలో టీడీపీ లీగల్ సెల్ జిల్లా కార్యాలయాన్ని శనివారం ప్రారంభించారు. పార్టీ నంద్యాల నియోజకవర్గ ఇన్‌చార్జి ఎన్ఎండీ ఫరూక్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, ప్రముఖ న్యాయవాది వెదుర్ల రామచంద్రారావు ముఖ్య అతిథులుగా హాజరై కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ లీగల్ సెల్ నాయకులు, న్యాయవాదులు, తదితరులు పాల్గొన్నారు.

మిట్టకందాలలో గ్రామసభ

పాములపాడు, మార్చి 2: మండలంలోని మిట్టకందాల గ్రామంలో ఈ క్రాప్ సామిజిక తనిఖీ కోసం రైతుల ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. శనివారం మండల వ్యవసాయశాఖ అధికారి పణీశ్వరరెడ్డి రైతులు సాగుచేసిన శనగ, మినుము కంది, జొన్న పంటలను నమోదు చేశారు. ఈ క్రాప్ చేసిన పంటలు, రైతుల వివరాలను ఆర్బీకేలలో ప్రదర్శించారు. ఇందులో అభ్యంతారాలు ఉంటే ఈనెల 5వ తేదీలోపు రాత పూర్వకంగా తెలియచేయాలని తెలిపారు. ఈ కార్యకర్మంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

'బోరుకు మరమ్మతులు చేపట్టాలి'

ఆత్మకూరు, మార్చి 2: ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలోని కప్పలకుంటలోని మల్లెలమ్మ దేవాలయం వద్ద ఉన్న చేతి పంపు మరమ్మతులకు గురైందని, మరమ్మతులు చేపట్టాలని మాజీ ఎంపీటీసీ పాల అంకయ్య, శివన్నగౌడు, మల్లెలమ్మ దేవాలయ ప్రెసిడెంటు తిరుపతయ్య, వైస్ ప్రెసిడెంటు సిద్దయ్య, శంకర్ డిమాండ్ చేశారు. శనివారం వారు మాట్లాడుతూ చేతి పంపు మరమ్మతులకు గురై నెలరోజులు కావస్తున్నా ప్రజాప్రతినిధులు గానీ, అధికారులు గానీ పట్టించుకోవడం లేదని వాపోయారు. స్పందించకపోతే ఖాళీ బిందెలతో మున్సిపల్ కార్యాలయం ముట్టడిస్తామని వారు హెచ్చరించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

నంద్యాల క్రైం, మార్చి 2: ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడు నంద్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. నంద్యాల పట్టణంలోని ఇస్లాంపేటలో నివాసం ఉంటున్న అలిబాషా ఇంట్లో పక్కింటికి చెందినవారు మీ ఇంట్లో మూడు అడుగుల స్థలం తమదని తరచూ బెదిరించేవారని, వారి వేధింపులు తాళలేక గత బుధవారం ఇంట్లో ఉన్న ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు వెంటనే అలిబాషను చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే కోలుకోలేక మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు మూడో పట్టణ పోలీసులు తెలిపారు.

గొడవలకు పాల్పడితే చర్యలు: డీఎస్పీ



నెహ్రూనగర్‌లో పల్లె నిద్ర కార్యక్రమంలో పాల్గొన్న డీఎస్పీ, సీఐలు

పగిడ్యాల, మార్చి 2: గ్రామాల్లో ప్రశాంత వాతావరణానికి భంగం కలిగిస్తూ గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు హెచ్చరించారు. మండలంలోని లక్ష్మాపురం గ్రామంలో లక్ష్మీ చెన్నకేశ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా మూడు రోజుల కిందట ఎమ్మెల్యే ఆర్థర్, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి వర్గాల మధ్య నెలకొన్న గొడవపై శనివారం ఆయన విచారణ చేపట్టారు. ఆలయంలో గ్రామస్థులతో సమావేశమై గొడవకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల సందర్భంగా గ్రామాల్లో ఎలాంటి గొడవలు జరిగిన సహించేది లేదని ఆయన హెచ్చరించారు. ఏవైనా సమస్యలు ఉంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. అనంతరం నెహ్రూనగర్ గ్రామంలో పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నందికొట్కూరు రూరల్ సీఐ విజయభాస్కర్ సిబ్బంది ఉన్నారు.

చంద్రబాబు పర్యటనను జయప్రదం చేయండి

● హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలించిన టీడీపీ నాయకులు



నంద్యాలలో హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

నంద్యాల (నూనెపల్లె), మార్చి 2: టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నంద్యాల పర్యటనను విజయవంతం చేయాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ గౌడ్, పొలిట్ బ్యూరో సభ్యుడు, నంద్యాల ఇన్‌చార్జి ఎన్ఎండీ ఫరూక్ పిలుపునిచ్చారు. ఈనెల 6వ తేదీ చంద్రబాబు నాయుడు నంద్యాలకు రానున్న నేపథ్యంలో నంద్యాలలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో హెలిప్యాడ్ స్థలాన్ని టీడీపీ నాయకులు పరిశీలించారు. హెలిప్యాడ్‌కు సంబంధించిన పనులను త్వరగా పూర్తి చేయాలని మల్లెల రాజశేఖర్, ఫరూక్ సూచించారు. వారి వెంట టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఏవీఆర్ ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు వాకా శివశంకర్ యాదవ్, మాజీ కౌన్సిలర్లు మిద్దె హుసేన్‌రెడ్డి, కృపాకర్, తదితరులు ఉన్నారు.

20 వరకు ఎంఎస్ఎంఈ సర్వే: కలెక్టర్



ఎంఎస్ఎంఈ సర్వే పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

నంద్యాల (నూనెపల్లె), మార్చి 2: ప్రపంచ బ్యాంక్ ఆర్థిక సహకారంతో కేంద్ర ప్రభుత్వం ర్యాంప్ స్కీమ్ ద్వారా రాష్ట్రంలో ఎంఎస్ఎంఈ ఏకీకృత పోర్టల్ ప్రారంభించిందని, ఈనెల 20వ తేదీ వరకు సర్వే చేపట్టాలని కలెక్టర్ కె.శ్రీనివాసులు అధికారులకు ఆదేశించారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో పరిశ్రమల జిల్లా మేనేజర్ శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి పోస్టర్లను విడుదల చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ తయారీ, సేవా, వాణిజ్య రంగంలోని అన్ని ఎంఎస్ఎంఈలను సర్వే చేసి వాటిని డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లోకి తీసుకొని వచ్చి పోర్టల్‌కు అనుసంధానించాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాలలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, పట్టణ ప్రాంతాలలో వార్డు అమినిటీస్ సెక్రెటరీలు సర్వేలు చేపట్టాలని ఆదేశించారు. పరిశ్రమల శాఖ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న సర్వేలో డేటాను సేకరించి పోర్టల్‌ను అనుసంధానం చేయనున్నట్లు తెలిపారు. దీని ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంఎస్ఎంఈలకు అందించే పథకాలు, బ్యాంక్ రుణాలు సులభంగా పొందడం, ఆలస్యమైన చెల్లింపులను, తదితర వాటి నుంచి ప్రయోజనాలు లాభిస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కరాటే బెల్ట్ గ్రేడింగ్ పోటీలు



బెల్ట్ గ్రేడ్‌లు సాధించిన క్రీడాకారులు

నంద్యాల (నూనెపల్లె), మార్చి 2: జిల్లా జీత్ కునెడో కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం నంద్యాలలోని రామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో కరాటే బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. జిల్లా సంఘం ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి సంఘం అధ్యక్షుడు, ఐఎంఏ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జి.రవికృష్ణ ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. పోటీలలో ప్రతిభ కనబర్చిన వారికి వివిధ బెల్ట్‌లు అతిథులు ప్రదానం చేశారు. లయన్స్ క్లబ్ నంద్యాల శాఖ కార్యదర్శి నాగరాజు, కరాటే మాస్టర్ లాల్ తరూన్, ఉదయ్ సాయికృష్ణ, నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం



సీడీపీవో, ఏసీడీపీవోను సన్మానిస్తున్న అంగన్‌వాడీలు

పాములపాడు, మార్చి 2: పాములపాడులో అంగన్‌వాడీ టీచర్ల ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శనివారం ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సర్పంచ్ భాగ్యమ్మ, ఐసీడీఎస్ సీడీపీవో కోటేశ్వరమ్మ, ఎసిడిపిఓ మంగవళ్ళి, సైపర్‌వైజర్ లలిత ప్రభావతి పాల్గొన్నారు. మార్చి 8న శివరాత్రి పండుగ రోజు సెలవు ఉండడంతో మహిళా దినోత్సవాన్ని ముందుగానే నిర్వహించినట్లు తెలిపారు. వారు మాట్లాడుతూ నేడు దేశంలో మహిళలు అన్ని రంగాల్లో ముందున్నారని, ప్రభుత్వాలు మహిళలకు సముచిత స్థానం కల్పించారని మహిళ సాధికారిత, ప్రాముఖ్యత గూర్చి వివరించారు. మంచి సేవలందించిన సీనియర్ ఆయాలకు బహుమతులను అందచేశారు. ఐసీడీఎస్ అధికారులను, ఏపీవో విమలమ్మ అంగన్‌వాడీలలు తదితరులు శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మహానంది, మార్చి 2: ఆరో తరగతిలో ప్రవేశానికి మార్చి 31 తతేదిలోగా దరఖాస్తు చేసుకోవాలని మహానంది మండలం తిమ్మాపురం ప్రభుత్వ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌రావు శనివారం తెలిపారు. 2024-25 సంత్సరానికి గాను 6 వ తరగతిలో ప్రవేశం కోసం ఓసీ, బీసీ విద్యార్థులు రూ.150, ఎస్సీ, ఎస్టీలు రూ.75 దరఖాస్తు రుసుం చెల్లించాలని చెప్పారు. పూర్తి వివరాల కోసం 9492406058, 9502429106 నెంబర్లను సంప్రదించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

● యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

నంద్యాల (నూనెపల్లె), మార్చి 2: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శనివారం నంద్యాలలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల ప్రాంతీయ సమావేశం జరిగింది. వెంకటేశ్వర్లు హాజరై మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. అధికారం కోసమే వైసీపీ ప్రభుత్వం చేతకాని హామీలను గుప్పించి ఓట్లు దండుకొని నిలువునా మోసం చేశారని ధ్వజమెత్తారు. విద్య, ఉపాధ్యాయ రంగ సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం కాల క్షేపం చేస్తుందని అన్నారు. వెంటనే న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర సహ అధ్యక్షుడు సురేష్, జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

ఇంటర్ పరీక్షా కేంద్రం తనిఖీ

చాగలమర్రి, మార్చి 2: చాగలమర్రి గ్రామంలోని వాసవీ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారం రఘునాథ్‌రెడ్డి శనివారం తనిఖీ చేశారు. విద్యార్థుల పరీక్షా గదులను సందర్శించారు. 273 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 36 మంది గైర్హాజరయ్యారని అన్నారు. మాస్ కాపింగ్‌ను ప్రోత్సహిస్తే చర్యలు తప్పవని అన్నారు. పరీక్షలు పకడ్బందిగా నిర్వహించాలని సీఎస్, డీవోలకు ఆదేశించారు.

దొంగతనాలను అరికట్టాలని వినతి



డోన్ డీఎస్పీకి వినతి పత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

డోన్ (రూరల్), మార్చి 1: డోన్‌లో దొంగతనాలు అరికట్టాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు హేమసుందర్ రెడ్డి డిమాండ్ చేశారు. డోన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. హేమసుందర్ రెడ్డి మాట్లాడుతూ పట్టణంలో పలు ప్రాంతాల్లో మత్తు పదార్థాల సరఫరా జరుగుతుందని ఆరోపించారు. అక్రమ మద్యం విక్రయాలు జరుగుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారని అన్నారు. పట్టణంలో అసాంఘీక కార్యకలాపాలపై పోలీసులు నిఘా ఉంచాలని డీఎస్పీని కోరారు. ఈ సమావేశంలో బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కౌన్సిల సభ్యులు ఆంజనేయ, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు భరణి రమేష్, మాజీ ప్రధాన కార్యదర్శి ఆర్మీ రామయ్య, జిల్లా నాయకులు ఉమ్మాజి రావ్, ఓబీసీ మోర్చా జిల్లా నాయకులు అబొకు శ్రీనివాసులు, కార్యకర్తలు ఉన్నారు.

పదోన్నతుల్లో సీనియర్లకు అన్యాయం

ఆళ్లగడ్డ, మార్చి 2: ఎక్సైజ్‌శాఖలో (మద్యం) పని చేస్తున్న సీనియర్లకు పదోన్నతులు కల్పించడంలో రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ ఉన్నతాధికారులు అన్యాయం చేస్తున్నారని సీనియర్ ఉద్యోగులు శనివారం ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్సైజ్‌శాఖలో తమ కంటే వెనుక ఉద్యోగంలో చేరిన వారికి పదోన్నతులు కల్పిస్తూ తమకు తీరని అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి పరిస్థితి ఏ శాఖలో లేదని, ఉన్నతాధికారులు జూనియర్స్ వద్ద నుంచి లాభాపేక్ష పొందడంతోనే జూనియర్స్‌కు పదోన్నతులు కల్పించడం జరుగుతున్నదని ఆరోపించారు. ఈ పరిస్థితిని రాష్ట్ర ఎక్సైజ్ సంబంధిత అధికారులు గమనించి తమకు న్యాయం చేయాలని సీనియర్ అధికారులు కోరారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు



విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న సీడీపీవో శంషాద్ బేగం

డోన్(రూరల్), మార్చి 2: చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని డోన్ ఐసీడీఎస్ సీడీపీవో శంషాద్‌భేగం అన్నారు. శనివారం మండలంలోని కొత్తపల్లి గ్రామ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో భేటి భచావో-భేటీ పడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్న వయసులోనే బాలికలకు వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని అన్నారు. చిన్న వయసులోనే వివాహాలు చేస్తే జరిగే అనార్థాలపై సీడీపీవో అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థినులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, ఐసీడీఎస్ సిబ్బంది, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి పనులను ప్రారంభించనున్న మంత్రి

బేతంచెర్ల, మార్చి 2: బేతంచెర్ల మండలంలోని వివిధ గ్రామాల్లో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఆదివారం ఉదయం 8 గంటల నుంచి పలు ప్రారంభోత్సవ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి శనివారం తెలిపారు ఈ కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

దేశంలో ప్రజా వ్యతిరేక పాలన



మాట్లాడుతున్న ముప్పల నాగేశ్వరరావు

డోన్(రూరల్), మార్చి 1: దేశంలో ప్రజా వ్యతిరేక పాలన నడుస్తుందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పల నాగేశ్వరరావు ఆరోపించారు. శనివారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ముప్పల నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం పేదల సంక్షేమానికి చేసిందేమీ లేదని ధ్వజమెత్తారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే వంట గ్యాస్ ధరలు విపరీతంగా పెంచేసిందన్నారు. వంట గ్యాస్ ధరలు పేదలకు అందుబాటులోకి లేకుండా బీజేపీ ప్రభుత్వం చేసిందన్నారు. అలాగే పెట్రోల్, డీజిల్ ధరలు సామాన్యులకు అందుబాటులో లేకుండా పోయిందని వాపోయారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు మోటరాముడు, మండల కార్యదర్శి పులిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో టీడీపీ కార్యకర్త మృతి

ప్యాపిలి, మార్చి 2: మండలంలోని రామక్రిష్ణాపురం గ్రామంలో టీడీపీ కార్యకర్త వెంకటసుబ్బయ్య(52) శనివారం గుండెపోటుతో మృతి చెందాడు. టీడీపీ యువనాయకులు కోట్ల రాఘవేంద్రరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వై నాగేశ్వరరావుయాదవ్, అలేబాదు పరమేష్, టి శ్రీనివాసులు తదితరులు వెంకటసుబ్బయ్య మృత దేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. అనంతర కుటుంబ సభ్యులను ఓదార్చారు. పార్టీ కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

వెంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

రుద్రవరం, మార్చి 2 : మండలంలోని వాసాపురంలో కొలువుదీరిన వెంకటేశ్వర స్వామి, లక్ష్మీగోదా దేవి, మానస లింగేశ్వర స్వామి త్రిపురసుందరీదేవి అమ్మవార్లకు అర్చకులు గోపిశర్మ, శివశర్మ ప్రత్యేక పూజలు చేశారు. శనివారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి లక్ష కుంకుమార్చన చేశారు.

● మండలంలోని నరసాపురం, రుద్రవరం సమీపంలోని దొర్వి, గుట్టకొండ నరసింహస్వామి ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు చేశారు.

వీరాంజనేయ స్వామికి పూజలు

చాగలమర్రి, మార్చి 2: చాగలమర్రిలోని వీరాంజనేయస్వామి ఆలయంలో శనివారం మాఘమాసం సందర్భంగా వేద పండితుడు ప్రతాప్ శర్మ ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు. మహిళలు సామూహికంగా తమలపాకులతో అభిషేకాలు చేశారు. భజన కార్యక్రమాలు నిర్వహించారు. పట్టాభిరామ ఆలయంలో ఎస్ఎస్ఎఫ్ మహిళలు 108 దీపాలతో దీపోత్సవం చేశారు.

వైసీపీకి ఓటమి ఖాయం: మాజీ మంత్రి



పింఛను రాలేదంటూ అఖిలప్రియ ముందు తన గోడు చెబుతున్న మహిళ



చాగలమర్రిలో సూపర్-6 బ్యాగులను అందజేస్తున్న టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా



రుద్రవరం మండలం చిన్నకంబలూరులో కరపత్రాలు చూపుతున్న టీడీపీ నాయకులు

ఉయ్యాలవాడ, మార్చి 2: వచ్చే ఎన్నికల్లో వైసీపీకి ఓటమి ఖాయమని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ అన్నారు. శనివారం ఉయ్యాలవాడ గ్రామంలో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ నిర్వహించారు. భూమా అఖిలప్రియ, భార్గవరామ్‌కు మండల నాయకులు బాణ సంచాతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ తిరిగి బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కరపత్రాలు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో రాక్షస పాలన కొనసాగుతుందన్నారు. వైసీపీని ఓడించేందుకు ప్రజలందరూ ఓట్లు ఎప్పుడు వస్తాయా అని ఎదురు చూస్తున్నారన్నారు. ఈ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను భరించలేక చాల మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలు తమ పార్టీలో చేరుతున్నారన్నారు. గ్రామసర్పంచ్‌ల నిధులను ప్రభుత్వం కొల్లగొట్టిందన్నారు. గ్రామాల్లో కనీసం తాగునీరు అందించేందుకు నిధులు లేక సర్పంచ్‌లు సతమతమవుతున్నారని ఆమె తెలిపారు. అంగన్వాడీలు, ఆశా వర్కర్లు ఉపాధ్యాయులకు జీతాలు ఇవ్వడం లేదన్నారు.

● సాగునీరందక పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సాగునీటి పారుదల ప్రధాన సలహాదారుడుగా ఉన్న గంగుల ప్రభాకర్‌రెడ్డి రైతులకు సాగునీరందించలేకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రభుత్వానికి ముందు చూపు లేక చెరువులను ప్రాజెక్టులను నింపలేకపోయిందన్నారు. నీరందక వరి, మొక్కజొన్న, పొగాకు తదితర పంటలు ఎండిపోతున్నాయని రైతులు అఖిలప్రియ దృష్టికి తెచ్చారు.

● ఈ ప్రభుత్వంలో తమకు ఇంటిస్థలం, పింఛను అందలేదని గ్రామానికి చెందిన మౌలాన్‌బీ తమ గోడును అఖిలప్రియ ముందు వెల్లబుచ్చారు, నాయకులు అధికారుల చుట్టూ ఎంత తిరిగినా తనకు ఇంటిస్థలం ఇవ్వలేదన్నారు. అలాగే తన భర్త వికలాంగుడై మంచాన పడ్డా పింఛన్ ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మరో రెండునెలల్లో ప్రభుత్వం వస్తుందని, తమ ప్రభుత్వం రాగానే ఇంటిస్థలం, పింఛను అందిస్తామని ఆ మహిళకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు బోరెడ్డిశేఖర్‌రెడ్డి, మండల కన్వీనరు కుడాల నారాయణరెడ్డి, బోరెడ్డి నర్సిరెడ్డి, మండల నాయకులు మారంరెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి, పేరెడ్డి మోహన్‌రెడ్డి, గడ్డం దస్తగిరిరెడ్డి, బోరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, పల్లెబాబుల్‌రెడ్డి, మద్దూరు క్రిష్ణారెడ్డి, గోపిరెడ్డి హరిప్రసాద్‌రెడ్డి, అబ్బిగారి నర్సింహులు, ఆకుల వెంకటసుబ్బయ్య, నారాయణరెడ్డి, మద్దిలేటిరెడ్డి పాల్గొన్నారు.

వైసీపీకి రోజులు దగ్గరపడ్డాయి

చాగలమర్రి, మార్చి 2: రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనకు రోజులు దగ్గర పడ్డాయని టీడీపీ మైనార్టీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా అన్నారు. శనివారం టీడీపీ కార్యాలయంలో చంద్రబాబు అమలు చేసిన సూపర్-6 పథకాల బ్యాగులను, మేనిఫెస్టో పత్రాలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ నాయకులు, కార్యకర్తలు సూపర్-6 పథకాల గురించి ప్రజలకు వివరించి టీడీపీ అధికారంలోకి రాగానే సంక్షేమ పథకాలు అమలు అవుతాయని అన్నారు. టీడీపీతోనే పేదల సంక్షేమం అన్నారు. చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని అన్నారు. టీడీపీ విజయం కోసం సైనికుల్లా పని చేయాలని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ ఉపాధ్యక్షుడు ముల్లా శ్యాబుల్, క్లస్టర్ ఇన్‌చార్జి అజిమ్, టీడీపీ నాయకులు గఫార్, నూర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

వచ్చేది బాబు ప్రభుత్వమే...

రుద్రవరం, మార్చి 2 : రెండు నెలల్లో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది టీడీపీ ప్రభుతమేనని చిన్నకంబలూరు గ్రామ టీడీపీ నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం గ్రామంలో చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ పథకాలు కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రతి ఇంటికీ కరపత్రాలు పంపిణీ చేసి సూపర్‌సిక్స్ పత్రాలను వివరించారు. జనసేప - టీడీపీ పార్టీలు కూటమితో రాబోవు రోజుల్లో ప్రభుత్వం ఏర్పడుతుందన్నారు.

295 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు



చాగలమర్రిలో పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఆర్డీవో మల్లికార్జునరెడ్డి

చాగలమర్రి, మార్చి 2: ఆళ్లగడ్డ నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా 295 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు నంద్యాల ఆర్డీవో మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు. శనివారం చాగలమర్రిలోని పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద మౌళిక వసతులపై అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ చాగలమర్రి మండలంలో 52 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని అన్నారు. నియోజకవర్గంలో 2.30 లక్షల మంది ఓటర్లు ఉన్నారని, 598 మంది సర్వీసు ఓటర్లు ఉన్నారని తెలిపారు. సమస్యాత్మక గ్రామాలను గుర్తించామని, వాటిపై ప్రత్యేక నిఘా ఉంచామని అన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద కేంద్ర సాయుధ బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. 14 వేల కొత్త ఓటరు కార్డులను ఓటర్లకు పోస్టల్ శాఖ ద్వార పంపిణీ చేస్తున్నామని అన్నారు. దొంగ ఓట్లను అరికట్టేందుకు ఓటరు కార్డులకు బార్ కోడ్ ఉంటుందని అన్నారు. ఈ ఎన్నికల్లో కొత్తగా హోమ్ ఓటింగ్ విధానాన్ని అమలు చేస్తున్నామని, 85 సంవత్సరాలు నిండిన వృద్ధులు, వికలాంగులు తమ ఇళ్ల వద్దనే ఓటు హక్కు వినియోగించుకోవచ్చని అన్నారు. ఆయన వెంట డీటీ విజయ్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

రుద్రవరం: రాబోయే సార్వత్రిక ఎన్నికలకు ఎన్నికలకు సిద్ధంగా ఉన్నట్లు నంద్యాల ఆర్డీవో, ఆళ్లగడ్డ నియోజకవర్గ ఎన్నికల అధికారి మల్లిఖార్జునరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం రుద్రవరం తహసీల్దారు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ 85 ఏళ్లు దాటి నడవలేని వృద్ధులకు, పూర్తిగా అంగవైకల్యం ఉన్న వికలాంగులకు హోం ఓటింగ్ ఎన్నికల సంఘం ఏర్పాటు చేసిందన్నారు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలో కొత్తగా ఆరువేల మంది యువకులు ఓటు హక్కును తొలిసారిగా వినియోగించుకుంటారని ఆయన అన్నారు. కొత్తగా మంజూరైన ఓటరు కార్డు లేకపోతే ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవడానికి 1+11 కార్డులను కేంద్ర ఎన్నికల సంఘం అనుమతించిందన్నారు. పోలింగ్ కేంద్రాల్లో కర్నూలు జిల్లా ఉండి వాటిని నంద్యాల జిల్లాగా రాయిస్తున్నామన్నారు.

● మండలంలోని ఆలమూరు, పెద్దకంబలూరు, యల్లావత్తుల గ్రామాల్లో ల్యాండ్ కన్వర్షన్ కోసం దరఖాస్తు చేసుకునే భూములను నంద్యాల ఆర్డీవో మల్లిఖార్జునరెడ్డి పరిశీలించారు. శనివారం ఆ భూములను పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదికను పంపిస్తామన్నారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దారు రవీంద్రప్రసాద్, వీఆర్వోలు ఉన్నారు.

మద్దిలేటి స్వామి క్షేత్రానికి రూ.5.16 లక్షల ఆదాయం

బేతంచెర్ల, మార్చి 2 : మద్దిలేటి నరసింహస్వామి క్షేత్ర ఆదాయం రూ.5.16 లక్షలు సమకూరినట్లు ఉప కమిషనర్, ఆలయ ఈవో రామాంజనేయులు, చైర్మన్ సీతారామచంద్రుడు శనివారం తెలిపారు. భక్తులు వేకువజాము నుంచే స్వామి అమ్మవార్లకు అభిషేకాలు, గండ దీపాలు, ప్రత్యేక పూజలు చేసి పుట్టు వెంట్రుకలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. స్వామి సేవా టికెట్లు, లడ్డూ ప్రసాదం, కేశ ఖండన, రూము బాడుగలు, లీజుల వసూళ్ల ద్వారా రూ.5,16,820 దేవస్థానానికి ఆదాయం లభించినట్లు వారు తెలిపారు. అదేవిధంగా భక్తుల ఇంటి ఇలవేల్పు ఆరాధ్య దైవం కావడంతో డోన్ పట్టణానికి చెందిన కె.వెంకటసుబ్బయ్య, ఆయన సతీమణి జయప్రద స్వామివారికి 350 గ్రాముల వెండి వస్తువులను ఆలయ ఈవోకు అందజేసినట్లు ఆయన తెలిపారు.

మసీదు ప్రారంభం

కోవెలకుంట్ల, మార్చి 2: పట్టణంలోని ఐదు ల్యాంపుల సెంటర్ సమీపంలో నూతనంగా నిర్మించిన పెద్ద బారం మసీదును ముస్లిం మత పెద్దలు, గ్రామ నాయకులతో కలిసి ప్రారంభించారు. మసీదు చిన్నదిగా ఉండడంతో తొలిగించి దాతలు, ముస్లింల సహకారంతో సుమారు 2కోట్లతో నిర్మించారు. ఒకేసారి వెయ్యి మంది మసీదులో ప్రార్థనలు చేసుకునే విధంగా పెద్ద మసీదును నిర్మించారు.

మద్యం విక్రేత అరెస్టు

సంజామల,, మార్చి 2: గుల్లగుర్తి గ్రామానికి చెందిన నల్లగట్ల పెద్ద పెద్దయ్య సంజామల రైల్వే బ్రిడ్జి సమీపంలో అక్రమంగా మద్యం విక్రయిస్తుండడంతో శనివారం పట్టుకున్నామని ఎస్ఐ రమేష్‌రెడ్డి తెలిపారు. నిందితుడి వద్ద 28 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకొని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దాం



శిరివెళ్లలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, సిబ్బంది

శిరివెళ్ల, మార్చి 2 : పోలియోరహిత సమాజాన్ని నిర్మిద్దామని శిరివెళ్ల పీహెచ్‌సీ వైద్యులు దివ్య, ముఖేష్, సీహెచ్‌వో రామ్మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. పీహెచ్‌సీ పరిధిలోని 3,535 మంది 0-5 సంవత్సరాల లోపు చిన్నారులకు ఆదివారం తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని గ్రామంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం నుంచి శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ఎన్ సరస్వతి, సూపర్‌వైజర్ రవి కిశోర్, అమినాబీ, సౌజన్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

చాగలమర్రి: చాగలమర్రి గ్రామంలో వైద్యులు ఇమ్రాన్, సూపర్‌వైజర్ రామలింగారెడ్డి ఆధ్వర్యంలో బాలుర, బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు శనివారం ర్యాలీ నిర్వహించారు. తల్లిదండ్రులు పిల్లలకు పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఈ వెంకటమ్మ, ఎంఎల్‌హెచ్‌పీలు, పీడీ దాదాపీర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రుద్రవరం: మండలంలో పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైద్యాధికారులు శివమోహన్, బాబు, గాయత్రి అన్నారు. శనివారం యల్లావత్తుల గ్రామంలో విద్యార్థులు, ఆరోగ్య సిబ్బంది వీధుల వెంట ర్యాలీ చేశారు.

కోవెలకుంట్ల: ఆదివారం నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రేవనూరు పిహెచ్‌సి వైద్యులు విద్యాసాగర్ పేర్కొన్నారు 3300 చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు.

కొలిమిగుండ్ల: 0నుంచి 5 సంవత్సరాల లోపు పిల్లలు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని ఉప్పలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. శనివారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్లు యమున, నవీన్, ఎంఈవో శ్రీధర్‌రావు, ఏవో వెంకటేశ్వర్లు, పీహెచ్ఎం మల్లేశ్వరి, సూపర్‌వైజర్లు వేణుగోపాల్‌రాజు, దానమ్మ, వరలక్ష్మి, ఆరోగ్య ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ: పిల్లల జీవితానికి రెండు చుక్కలు చాలని వైద్యుడు నరసింహ అన్నారు. ఆదివారం నిర్వహించే పల్స్‌పోలియో కార్యక్రమంలో బాగంగా శనివారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. పట్టణంలో 5703 మంది చిన్నారులకు చుక్కలు వేయనున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో దస్తగిరిరెడ్డి, సూపర్‌వైజర్ ప్రసన్న పాల్గొన్నారు.

సంజామల: పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సంజామల ఎంపీడీవో నాగకుమార్, డాక్టర్ కృష్ణకుమారిలు కోరారు. శనివారం సంజామలలో విద్యార్థులతో పల్స్‌పోలియో అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్య సిబ్బంది వెంకటేశ్వర్లు, నారాయణ, ఆశావర్కర్లు, విద్యార్థులు తదిరులు పాల్గొన్నారు.

దొర్నిపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి నాగేంద్ర తెలిపారు. 0-5 సంవత్సరాల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని అన్నారు. దొర్నిపాడు పీహెచ్‌సీ పరిధిలో 1,400 మంది చిన్నారులు ఉన్నారని అన్నారు.

బనగానపల్లె: పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టంగుటూరు వైద్యధికారి డాక్టర్ శివశంకరుడు కోరారు. పట్టణంలోని భానుముక్కల జిల్లాపరిషత్ బాలుర ఉన్నతపాఠశాలనుంచి పల్స్‌పోలియో అవగాహన ర్యాలీ శనివారం నిర్వహించారు.

టీడీపీ బలోపేతానికి కష్టపడి పని చేశా

● టీడీపీ సీనియర్ నాయకుడు ధర్మవరం సుబ్బారెడ్డి



డోన్‌లో మాట్లాడుతున్న ధర్మవరం సుబ్బారెడ్డి

డోన్, మార్చి 2: డోన్ నియోజకవర్గంలో టీడీపీని బలోపేతం చేసేందుకు కష్టపడి పని చేశామని డోన్ నియోజకవర్గ టీడీపీ సీనియర నాయకుడు ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని తన నివాసం నుంచి సుబ్బారెడ్డి ప్రభుత్వ ఐటీఐ వరకు కార్యకర్తలతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో సుబ్బారెడ్డి మాట్లాడుతూ కోట్ల, కేఈ కుటుంబాల ఆశీస్సులతోనే టీడీపీ అధినేత చంద్రబాబు డోన్ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిగా తనకు బాధ్యతలు అప్పగించారన్నారు. కష్టాల్లో ఉన్న నియోజకవర్గ టీడీపీ కార్యకర్తలకు అండగా నిలిచి ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటూ వచ్చామన్నారు. చంద్రబాబు అప్పగించిన కార్యక్రమాలను, బాధ్యతలను ప్రజల్లోకి తీసుకెళ్లి నియోజకవర్గంలో టీడీపీని బలంగా తయారు చేశామని తెలిపారు. కోట్ల, కేఈ కుటుంబాలకు తాను 40 ఏళ్ల పాటు పని చేశానని గుర్తు చేశారు. రైతుబిడ్డగా, ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు తనకు అవకాశం వస్తే వాటిని దూరం చేయడం సమంజసం కాదన్నారు. పార్టీ కోసం ఇంత కష్టపడిన తనకు ఒక్క మాట కూడా చెప్పకుండా కోట్ల సూర్యప్రకాష్ రెడ్డిని అభ్యర్థిగా ప్రకటించడం ఎంతో బాధ కలిగించిందన్నారు. నియోజకవర్గంలో పార్టీని నమ్ముకుని ఎంతో మంది కార్యకర్తలు ఉన్నారని, వారి నిర్ణయం ప్రకారమే తన భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో డోన్ మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మురళీకృష్ణగౌడు, పట్టణ టీడీపీ అధ్యక్షులు సీఎం శ్రీనివాసులు, మాజీ ఎంపీపీ ఆర్ఈ రాఘవేంద్ర, ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గంధం శ్రీనివాసులు, ఆలా మల్లికార్జునరెడ్డి, యువ నాయకులు ధర్మవరం గౌతమ్ రెడ్డి, భరత్ రెడ్డి, అభిరెడ్డిపల్లె గోవిందు, అల్లాబకాష్, న్యాయవాది కృష్ణప్రసాద్, ప్యాపిలి పట్టణ పార్టీ కార్యదర్శి సుంకయ్య, బేతంచెర్ల పట్టణ కార్యదర్శి షేక్షావలి చౌదరి, యాపదిన్నె సర్పంచ్ రామిరెడ్డి, జయన్న యాదవ్, మాజీ సర్పంచ్ ఈశ్వరయ్య. కమలాపురం రమేష్, చక్రపాణి గౌడు, కొచ్చెర్వు రామాంజనేయులు, గోసానిపల్లి శ్రీరాములు, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సభకు తరలి వెళ్లిన తెలుగు తమ్ముళ్లు

బేతంచెర్ల, మార్చి 2: పట్టణంలో డోన్ టీడీపీ సీనియర్ నాయకుడు ధర్మవరం సుబ్బారెడ్డి నిర్వహించే ఆత్మీయ సభకు బేతంచెర్ల నుంచి డోన్‌కు 86 వాహనాల్లో తెలుగు తమ్ముళ్లు తరలివెళ్లారు. మండల సమన్వయకర్త చంద్రశేఖర్, పట్టణ టీడీపీ ప్రధాన కార్యదర్శి షేక్షావలి చౌదరి ఆధ్వర్యంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు కార్యకర్తలు ఆయా వాహనాల్లో తరలివెళ్లారు. కార్యక్రమంలో డోన్ టీడీపీ బీసీ సెల్ అధ్యక్షులు తిరుమల్ నాయుడు, తిరుమలేష్ చౌదరి, బీసీ సెల్ పట్టణ ప్రధాన కార్యదర్శి లోకేశ్‌గౌడు, మల్లిపెద్ది నాగేశ్వరరెడ్డి, రమేష్ తదితరులు ఉన్నారు.

అభివృద్ధి చేశాం: మంత్రి

డోన్, మార్చి 2: డోన్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశామని రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని సాయి ఫంక్షన్ హాలులో ఇళ్ల లబ్ధిదారులకు భూసంపూర్ణ హక్కు పత్రాలను మంత్రి బుగ్గన అందజేశారు.కార్యక్రమంలో మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, జడ్పీటీసీ రాజ్‌కుమార్ యాదవ్, డోన్ ఆర్డీవో మహేశ్వరరెడ్డి, మున్సిపల్ కమిషనర్ జయరాం తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు



టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

బనగానపల్లె, మార్చి 2: బనగానపల్లె పట్టణానికి చెందిన 20 కుటుంబాలకు చెందిన వైసీపీ కార్పెంటర్లు మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి సమక్షంలో వైసీపీని వీడి శనివారం టీడీపీలో చేరారు. పట్టణంలోని 11వ వార్డుకు చెందిన కార్ఖాన్ స్కూల్ ఏరియాకు చెందిన కార్పెంటర్లు రఫీ, మాబాషా, ఖాజా, సలీం, షేక్ ఖాజాతో పాటు మరో 20 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. బీసీ జనార్దన్‌రెడ్డి వీరికి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో సీఐ జయచంద్ర, ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికలకు సహకరించాలి



ప్రజలతో మాట్లాడుతున్న ఎస్ఐ తిరుపాల్

బనగానపల్లె, మార్చి 2: గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని నందివర్గం ఎస్ఐ తిరుపాలు హెచ్చరించారు. మండలంలోని రామతీర్థం గ్రామంలో శనివారం గ్రామ నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో సమీపిస్తుండటంతో ఎలాంటి గొడవలు, అల్లర్లు సృష్టించరాదన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని అన్నారు. గ్రామాల్లో అసాంఘీక కార్యకలాపాలకు స్వస్తి పలికి శాంతియుత జీవనం గడపాలని అన్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తెస్తే పరిష్కరిస్తామని అన్నారు.

ముద్దవరంలో పల్లె నిద్ర

బేతంచెర్ల, మార్చి 2: ముద్దవరం గ్రామంలో బేతంచెర్ల పట్టణ సీఐ ప్రియతమ్‌రెడ్డి, ఎస్ఐ శివశంకర్ నాయక్ సిబ్బంది శనివారం రాత్రి పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. సచివాలయం వద్ద వివిధ పార్టీల నాయకులు, గ్రామ ప్రజలతో సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తుల పట్ల కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే సైబర్ నేరాలు, మహిళలు, బాలబాలికలపై జరిగే నేరాల గురించి ప్రజలకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ చంద్రశేఖరప్ప, కానిస్టేబుల్ చెన్నయ్య, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మహా గర్జనను విజయవంతం చేయండి



పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

బనగానపల్లె, మార్చి 2: గుంటూరులో 9న నాగార్జున యూనివర్సిటీలో నిర్వహించే వికలాంగుల మహాగర్జనను విజయవంతం చేయాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షుడు అందనం దేవరాజు పిలుపునిచ్చారు. బనగానపల్లెలో శనివారం మహాగర్జన పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో శివనారాయణ, కత్తిఓబులేసు, చిన్నమునెయ్య, మద్దిలేటి, రమణ, యోగానంద్, సుబ్రహ్మణ్యం, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.